

వీధి కుక్కల స్వైర విహారం

జిల్లాలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. -8లో



అంతిమ యాత్రలో అపశ్రుతి

అంతిమ సంస్కారంలో భాగంగా పేల్చిన టపాసులు ఆ మార్గంలో పక్కనే ఉన్న టమాటా క్రేట్లపై పడటంతో అవి అంటుకుని కాలిపోయాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 503 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

23న ఇంటర్వ్యూ

రాయచోటి (జగదాంబసెంటర్): రాయచోటిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్. హైదరాలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

కూలీల కనీస వేతనం పెంపు

రాయచోటి: వివిధ ప్రభుత్వ శాఖలలో, గ్రామీణ, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న రోజువారి కూలీల కనీస వేతనాన్ని రూ. 35లు పెంచుతూ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కనీస వేతనం కమిటీ నిర్ణయం తీసుకుంది. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో రోజువారి కూలీల కనీస వేతనంపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కనీస వేతన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రంగరాజు, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్‌పీడీసీఎల్, డిఆర్‌డీఏ, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


'స్మార్ట్ మీటర్ల'తో ఉపయోగం



స్మార్ట్ మీటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్ అధికారి రమణ

రైల్వేకోడూరు అర్బన్: విద్యుత్‌శాఖ వారు బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మంగళవారం ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ అధికారి ఎస్ రమణ తెలిపారు. స్థానిక అటవీశాఖ అతిథి గృహంలో అమర్చిన స్మార్ట్ విద్యుత్ మీటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మీటర్ల వల్ల వినియోగదారుడు తన ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఎంత విద్యుత్ ఎన్ని యూనిట్లు వాడామని తెలుసుకోవచ్చని తెలిపారు. దాని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు.విద్యుత్ బిల్లు తగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 23న ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో విద్యుత్ ఏర్పాట్లపై తగిన సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో డివిజన్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, డీ భాస్కర్ రావు, ఏఈ యోగానంద్ పాల్గొన్నారు.

గండికోటకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



గండికోటజలాశయం లోకి 10.5 టీఎంసీలు చేరిన కృష్ణాజలాలు

కొండాపురం: గండికోట జలాశయానికి మూడు రోజుల నుంచి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉందని జలవనరులశాఖ డీఈ ఉమమాహేశ్వర్లు మంగ్లవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో పూర్తిగా నీటిసామర్థ్యం ఉండటంతో అక్కడ నుంచి అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరినగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా గండికోట టర్నల్ లో నుంచి 11 వేల క్యూసెక్కుల కృష్ణజలాలు ఇన్‌ఫ్లో వస్తున్నాయన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో ఎగువ ప్రాంతాలల్లో కురిసిన వరద నీటి ఉధృతికి ఇక్కడి వంకలువాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పెన్నా ద్వారా 2 వేల క్యూసెక్కుల వరదనీరు గండికోటకు చేరుతోందన్నారు. కాగా గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26. 85 టిఎంసీలు ఉండగా ప్రస్తుతం 10.5 టీఎంసీలకు చేరినట్లు ఆయన తెలిపారు. గండికోట జలాశయం నుంచి శెట్టి వారి పల్లె వద్ద మొయిన్ హెడ్ రెగ్యూలేటర్ నుంచి జీఎన్ ఎస్ఎస్ కాలవు ద్వారా 500 క్యూసెక్కులనీరు సర్వరాయసాగర్ కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆయాల ఆకలి కేకలు

- ప్రభుత్వ బడుల్లో ఆయాలు, వాచ్‌మెన్‌లకు అందని జీతాలు
- కుటుంబం గడవక అవస్థలు
- పట్టించుకోని పాలకులు, విద్యాశాఖ అధికారులు




జెడ్పీ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ: ఒకటి రెండు కాదు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆయాలు అల్లాడుతున్నారు. పూట గడవక అవస్థలు పడుతున్నారు. పొట్టకూటి కోసం పాఠశాలల్లో పారిశుధ్య పనులకు చేరిన చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. వారు చేసే కష్టాన్ని ఏ మాత్రం గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వాచ్‌మెన్‌లకు ఈఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు పెండింగ్‌లో పెట్టారు. దీంతో వారి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న ఆయా, నైట్ వాచ్‌మెన్‌ల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినపడటం లేదా అని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'అప్పులు చేసి కుటుంబ పోషణ

నెలవారీగా ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌లకు జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ. 5 వేల నుంచి రూ.10 వేల వరకు వడ్డీలకు అప్పులు తీసుకుని కుటుంబాలకు పోషించుకుంటున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌లకు రూ.6 వేలు నెలకు ప్రభుత్వం జీతం మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒకొక్కరికి రూ. 24 వేలు జీతం పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడిస్తున్నారు.





పట్టించుకోని ఉన్నతాధికారులు

జీతాల పెండింగ్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలను మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జీతాలు పెండింగ్ తగదు




ప్రభుత్వ బడుల్లో పొట్టకూటి కోసం పని చేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాలను నాలుగు నెలలుగా మంజూరు చేయకపోవడం దారుణం. ఈ కొత్త ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సమంజసం కాదు. జీతాలు లేకపోవడంతో కుటుంబం పోషించుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలి. –సాంబశివ, ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

బొజ్జ గణపయ్యా...
పొట్ట నింపవయ్యా!

వారు దుమ్ము, ధూళి చూడలేదు.. మండుతున్న ఎండను సైతం లెక్కచేయలేదు... పగలు, రేయి కష్టపడుతూనే ఉన్నారు.. పసిబిడ్డలను చంకనేసుకుని.. కాలే కడుపును చేతబట్టుకుని వందలాది కిలోమీటర్ల దూరం నుంచి ఇక్కడికి వచ్చారు. నాలుగు డబ్బులు కళ్లజూడొచ్చనే ఆశతో ఊరుగాని ఊరొచ్చారు.. కానీ వీరి కష్టానికి, ఆశలకు మధ్యన పెట్టుబడిదారులు చేరి ఫలితం దక్కకుండా చూస్తున్నారు. వినాయకుడి విగ్రహాల తయారీదారుల కష్టం కార్మికుడి పాలవుతోంది.

- కార్మికుడి కష్టం కాంట్రాక్టర్ పాలు
- ప్రారంభమైన వినాయక విగ్రహాల వ్యాపారం



విగ్రహానికి రంగులు వేస్తున్న కళాకారుడు

కడప కల్చరల్: మరో మూడు వారాల్లో శ్రావణ మాసం ముగిసి భాద్రపదం వస్తుంది. సందుగొందుల్లో సైతం గణపయ్య విగ్రహాలు వెలుస్తాయి. వినాయక చవితి సందళ్ల పందిళ్ల ఏర్పాటుతో ప్రారంభమవుతాయి. ఏటా నెలరోజుల ముందే ఊరిబయట విగ్రహాల తయారీ మొదలవుతుంది. రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాల తయారీదారులు ఈ ప్రాంతానికి వచ్చి అక్కడి నుంచి తెచ్చుకున్న సామగ్రితోపాటు స్థానికంగా లభించే సామగ్రితో విగ్రహాలు తయారు చేస్తారు. ఊరి బయట పెద్ద టెంట్లు వేసుకుని మహిళలు, పసిపిల్లలు కూడా వాటిలోనే గడుపుతారు. ఒకటి, రెండు నెలలపాటు తయారు చేసిన విగ్రహాలను అమ్ముకుని సంతృప్తిగా తిరిగి తమ ప్రాంతానికి వెళతారు. ఇదంతా మామూలే. కానీ ఈ సంవత్సరం పరిస్థితి కొద్దిగా మారింది. స్థానికంగా ఉండే పెట్టుబడిదారులు ముందే ముడి విగ్రహాలను తెచ్చిపెట్టుకుని రాజస్తానీ కళాకారులకు కాంట్రాక్టుపై రంగులు పూసే పని అప్పగించారు. సదరు పెట్టుబడి పెట్టిన స్థానికులే విగ్రహాలకు అడ్వాన్సులు తీసుకుని ప్రజలు కోరిన తేదికి విగ్రహాలను సిద్ధం చేయాలని కళాకారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆలస్యమైతే కూలీ తగ్గుతుందన్న భయంతో కళాకారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. కడప నగరంతోపాటు ఇతర పట్టణాలు, మండల కేంద్రాల శివార్లలో పెద్ద టెంట్లు వేసుకుని గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ముడి విగ్రహాలకు చేతులు, తొండం తగిలించి రంగులు పూసే పనిలో నిమగ్నమై ఉన్నారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితరప్రాంతాల నుంచి ఈ పనిపై జిల్లాకు 400–500 మంది వరకు వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. నిజానికి విగ్రహాల వ్యాపారం నిన్న, మొన్నటివరకు కళాకారుల ద్వారానే జరిగేది. ప్రస్తుతం పెట్టుబడి దారులు రంగప్రవేశం చేశాక కళాకారులంతా కూలీలుగా మారారు. తయారీదారుల ప్రమేయం లేకుండా కాంట్రాక్టర్లే విగ్రహాలకు ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. ఐదు అడుగుల విగ్రహం రూ. 8–10 వేలకు విక్రయిస్తున్నారు. 13 అడుగుల భారీ విగ్రహం రూ. 50–60 వేలకు ఇస్తున్నారు. తాము మాత్రం ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకుంటూ కళాకారులకు కూలీ మాత్రమే ఇస్తున్నారు. సీజన్ పోతే ఈ ఆదాయం కూడా ఉండదంటూ కళాకారులు వచ్చిన కాడికే తీసుకుంటున్నారు. అసలే దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. 'కాంట్రాక్టర్లకు మంచి మనసు ఇవ్వయ్యా..' అంటూ బొజ్జ గణపయ్యనే వేడుకుంటున్నారు.

పారిశ్రామిక ప్రగతి జరగాలి

- కమిటీ సలహాలతో కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తాం
- జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లాలో పరిశ్రమల స్థాపన జరిగి..ప్రగతి దిశగా అడుగుపడాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అన్నారు. పరిశ్రమల ప్రోత్సాహ కమిటీ సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకొని నూతన పారిశ్రామిక విధానం 2024–29ని రూపొందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లో నూతన పారిశ్రామిక విధానం 2024–29పై పారిశ్రామిక సంఘాలు, మేధావి వర్గాలు, వివిధశాఖల నుంచి సూచనలు, సలహాలు కోసం ప్రత్యేక జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు జిల్లాలో ఏర్పాటయిన, ఏర్పాటు చేయబోయే వివిధ పరిశ్రమలు గురించి, జిల్లాకు ఉన్న ప్రత్యేక ప్రయోజనాలు గురించి, పరిశ్రమల ఏర్పాటుకు ఎదురవుతున్న సవాళ్లు గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పారిశ్రామిక సంఘాలు, మేధావి వర్గాలు, వివిధ శాఖల నుంచి సూచనలు, సలహాలు అడుగగా పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పారిశ్రామిక ఎస్టేట్‌లలో కనీస అవసరాలైన రోడ్లు, నీటి సౌకర్యం తదితర మౌళిక సదుపాయాలు తప్పనిసరిగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటులో ముఖ్యమైన స్టాంపు డ్యూటీ తీసివేస్తే బాగుంటుందని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వీలైనన్ని ఎక్కువ పరిశ్రమలను ముఖ్యమంత్రి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మన జిల్లాలో టమోట, అరటి, మామిడి వంటి పండ్ల ఉత్పత్తులు చాలా ఎక్కువగా ఉంటుందని, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఎక్కువగా ఏర్పాటు చేస్తే మన జిల్లా నుంచి పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పర్యాటక శాఖను కూడా ఒక పరిశ్రమలాగా భావించి మన జిల్లాలో యువతకు ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరిబాబు, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

బాలకార్మికుల నిషేధాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, బాల కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమల యజమానులపై కఠినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బాలకార్మికుల నిషేధ చట్టం 1986, బాలకార్మికుల పరిరక్షణ , పునరావాసం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో గ్రానైట్, ఇటుక తదితర పరిశ్రమలలో బాలకార్మికులు పనిచేయకుండా చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. అనంతరం బాలల హక్కులపై మదనపల్లికు చెందిన వివిధ ఎన్‌జీఓలు రూపొందించిన రెండు పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.



పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

ఇసుక దోపిడీపై ఫిర్యాదుల వెల్లువ

- అక్రమ తరలింపు దారులపై ఉదాసీనత వద్దు
- జెడ్పీ చైర్ పర్సన్ శారద



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ శారద



సమావేశంలో పాల్గొన్న అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఇసుక, రాళ్లు, మట్టి వంటి సహజ వనరులను ఇష్టానుసారంగా తవ్వేసి అక్రమంగా తరలిస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో మైనింగ్ అధికారులు ఉదాసీనత వీడాలని జెడ్పీ చైర్ పర్సన్ శారద అన్నారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, రవికుమార్‌రెడ్డి, సుమిత్ర తదితరులు అక్రమ రవాణా అంశాన్ని లేవనెత్తారు. ఇందుకు జెడ్పీ చైర్ పర్సన్ స్పందిస్తూ మైన్స్ అధికారులతోపాటు రెవెన్యూ, పోలీసులు కూడా ఈ అంశంపై స్పందించాలన్నారు. 2020లో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలకు బిల్లులు ఇవ్వాలని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. అనుమతులు లేకున్నా ప్రైవేటు వ్యక్తులు కొంతమంది ఆర్వో వాటర్ అంటూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. ఇందుకు జెడ్పీ చైర్ పర్సన్ స్పందిస్తూ జిల్లాలో అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జెడ్పీకి రావాల్సిన నిధులను విడుదల చేయించాలని కోరారు. ఈనెల 23వ తేది జరిగే గ్రామసభల్లో సర్పంచులు, జెడ్పీటీసీలకు ప్రొటోకాల్ ప్రకారం ప్రాధాన్యత ఇవ్వాలని కమలాపురం జెడ్పీటీసీ సుమిత్ర కోరారు. కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జంగిల్ క్లియరెన్స్‌లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈనెల 23న జరిగే గ్రామసభలకు జెడ్పీటీసీలు హాజరై తమ ప్రాధాన్యత పనులను తెలియజేయాలని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. డీపీఆర్‌సీ భవనంలో జరిగిన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశాన్ని జెడ్పీ వైస్‌చైర్మన్ కిట్టు బాలయ్య నిర్వహించారు. ఈ సమావేశాల్లో పలువురు జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశ్నించేతత్వం ముఖ్యం

- శాస్త్రీయత లేని ఫలితాలను నమ్మవద్దు
- నేషనల్ సైంటిఫిక్ టెండర్ డేలో వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

వైవీయూ: శాస్త్రీయత లేని ఫలితాలను నమ్మవద్దని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే' ను విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విజ్ఞాన సాంకేతికతతో దేశం పురోగమిస్తుంటే మరోవైపు మూఢనమ్మకాలు విశ్వసిస్తుండడం బాధాకరమన్నారు. ఆర్థిక స్వావలంబనతో శాస్త్రీయత సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ బాల్యదశ నుంచే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సైన్సు మార్పును కోరుతుందని, ప్రగతిని ఆమోదిస్తుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ విశ్రాంత మేనేజర్ జి. గోపాల్ , ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త, డా. ఎన్. వెంకటరామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు సునీత, సరస్వతి, బాలబయన్న, వెంకటేశ్వర్లు, శివరాం, కిరణ్, గంగాధర్ రెడ్డి, కామేశ్వరమ్మ, శివరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

నిరసనల హోరు





కడప రిమ్స్‌లో రెండవరోజూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ డాక్టర్స్, వైద్య విద్యార్థులు, రాయచోటిలో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

కోల్‌కతాలో ఆర్‌జీవికార్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థినిపై అత్యాచారం, హత్య సంఘటన దోషుల్ని ఉరి తీయాలని జనం ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ర్యాలీలతో.. రిలే నిరాహార దీక్షలతో నిరసన తెలుపుతున్నారు. కడప రిమ్స్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండవరోజుకు చేరుకున్నాయి. నిందితులపై చర్యలను తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే రాయచోటిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. - నెట్‌వర్క్

వీధి కుక్కల స్వైర విహారం



- జిల్లాలో పెరుగుతున్న కుక్కల దాడులు
- రేబిస్ వైరస్ బారినపడే ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

రాజంపేటలో కుక్కకాటు ఇలా..

నెల	మే	జూన్	జూలై
బాధితులు	397	409	447

రాజంపేట : జిల్లాలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా వీధి కుక్కల సంతతి మాత్రం పెరుగుతూనే ఉంది. ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్) తన నివేదికలో కుక్కకాటుకు అనేక మంది బలవుతున్నారని తెలిపింది.

వీధికుక్కల వల్లే అనేక వ్యాధులు..

వీధి కుక్కల వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని అధికారిక నివేదికలు తెలుపుతున్నాయి. వీటివల్ల రేబిస్, డిస్టెంపర్ వైరస్, రర్వోవైరస్, టాక్సోప్లాస్మా, కెనైన్ ఆడినో వైరస్‌లు వ్యాపిస్తాయని వివరిస్తోంది.

కుటుంబ నియంత్రణ చర్యలు

వీధి కుక్కల దాడులు పెరిగిపోతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాజంపేట పట్టణంలో ఇద్దరు పిల్లలకు, ఒక వృద్ధురాలికి కుక్క కరవడంతో ఈ సంఘటనను మున్సిపాలిటీ సీరియస్‌గా తీసుకొని 153 కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి వదిలేశారు. వార్డుకు కనీసం 10 నుంచి 18 వరకు కుక్కలు ఉంటాయి.

మాంసపు వ్యర్థాలు తిని..

జిల్లాలో అనేక పట్టణాల్లో అనేక చోట్ల రోడ్లపై మాంసం దుకాణాలు ఉండటం సర్వసాధారణం. అయితే మాంసం అంగళ్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపై పడేయటం వల్ల వాటిని వీధి కుక్కలు తింటున్నాయి. మనుషులను కరవడానికి ఇది కూడా ఒక కారణమని పలువురు పేర్కొంటున్నారు.

మండలాల్లో...

రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ, ఒంటిమిట్ట, సిద్ధవటం, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో వీధి కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణ విషయంలో దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

క్షణ క్షణం.. భయం భయం

గత రెండు నెలల్లో కుక్కకాటు బాధితులు

కోడూరు	520
ఓబులవారిపల్లి	96
పెనగలూరు	36
పుల్లంపేట	08
చిట్వేలి	12

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పరిసర ప్రాంతాల్లో కొందరు ఇతర ప్రాంతాల నుంచి కుక్కలను తిరుపతి అటవీ ప్రాంతం ప్రధాన రహదారిపై వదిలి వెళుతుంటారు. అవి పట్టణంలోకి వచ్చి గృహ సముదాయాలు ఉండే వీధుల్లో తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలో పగడాలపల్లి, గాంధీనగర్, రంగనాయకులపేట, బాలానగర్, రెడ్డివారిపల్లి, కృష్ణానగర్, అంకమ్మనగర్, పాతబజార్, కొత్తబజార్, ధర్మాపురం, ఆంజనేయస్వామి గుడి వీధి, భుజంగేశ్వరాలయం, వెంకటేశ్వరస్వామి గుడి, హెచ్ఎంఎంహైస్కూల్, అటవీశాఖ కార్యాలయం తదితర ప్రాంతాలలో కుక్కలు రెండు రోజుల క్రితం 30 మందికిపైగా దాడులు చేశాయి. వీరంతా ఆస్పత్రులలో చికిత్స పొందారు. వీటి దెబ్బకు చిన్న పిల్లలను బయటకు పంపాలన్నా భయపడుతున్నారు. కొన్ని వీధుల్లో ప్రజలు కట్టెలు పట్టుకొని తిరుగుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ గుంపులు గుంపులుగా వాహనాలకు అడ్డం వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

కోడూరు మేజర్ పంచాయతీలోని పలు ప్రాంతాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నా పంచాయతీ అధికారులు దృష్టి సారించలేదు. ఎన్ని సార్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. దీనికి తోడు పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.





రైల్వేకోడూరు అంకమ్మ నగర్‌లో కుక్కలు, క్రిష్ణానగర్‌లో కుక్కల గుంపు

కుక్కలను పట్టుకెళ్లాలి



ప్రతి నిత్యం కుక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. వీధులలో అధికంగా తిరుగుతున్నాయి. ఎక్కడ కరుస్తాయో అని భయంగా ఉంటుంది. చిన్నపిల్లలను వీధుల్లోకి పంపడం లేదు. బడులకు పోవాలన్నా మేమే వెళ్లి వదిలి పెడుతున్నాం. కుక్కలను పట్టి దూర ప్రాంతాలలో వదిలే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సునీల్, టైలర్, నరశరాంపేట, కోడూరు.

కరిచిన వెంటనే జాగ్రత్తలు వహించాలి



కుక్కలు కరిచిన వెంటనే 15 నిమిషాలు సబ్బుతో శుభ్రం చేస్తూ ఉంటే అక్కడ బ్యాక్టీరియా ఏర్పడదు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువస్తే కుక్క కాటుకు చికిత్స చేస్తాం. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం ఉండదు.

– డాక్టర్ బ్రహ్మకుమారి, ప్రభుత్వ ప్రధాన వైద్యాధికారి, రైల్వేకోడూరు.

క్లుప్తంగా

మాక్ టెస్ట్ పరిశీలన

సంబేపల్లి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సీబీఎస్‌సీ పరీక్షలపై అవగాహనకు నిర్వహించిన బేస్‌లైన్ మాక్ టెస్ట్‌ను మంగళవారం డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు పరీక్షల సమయంలో ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

18 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్ మంగళవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని పెద్దపాలెం రైల్వే గేట్ వద్ద మంగళవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారంతో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న హోండా సిటీ కారును, 18 బాక్సుల కర్ణాటక మద్యం (1728 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తంబళ్లపల్లి మండలం జుంజర పెంటకు చెందిన కదిరేంద్ర బాబు (22), గాలివీడు మండలం తూముకుంటకు చెందిన శేషాద్రి (21), ములకలచెరువు మండలం దేవుళ్ళ చెరువుకు చెందిన రమణ (48), జయమ్మ (43), నరసమ్మ(48)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

భూ ఆక్రమణలపై విచారణ చేపట్టండి

రాయచోటి టౌన్ : మదనపల్లె నియోజకవర్గంలో భూ ఆక్రమణలు జరిగాయని, అలాగే ఓబులవారిపల్లె గనులలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమెల్సీ భూమిరెడ్డి రామగోల్ రెడ్డి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన స్టేట్ గెస్ట్ హౌస్ ఆవరణంలో విలేరుల సమావేశంలో మాట్లాడారు. ఓబులవారిపల్లె గనుల నిక్షేపాల వద్ద ఏ గ్రేడ్ గనులు బీ గ్రేడ్‌గా చూపించి అక్రమంగా తరలించి దోచుకున్నారని విమర్శించారు.

టిప్పర్లకు రూ. 24 లక్షలు జరిమాన

పెనగలూరు : అన్నమయ్య జిల్లా, పెనగలూరు మండలం, నారాయణ నెల్లూరు నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు వచ్చిన టిప్పర్లకు సబ్ కలెక్టర్ రూ. 24 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిసింది. ఈనెల 18వ తేదీ రాత్రి ఎనిమిది టిప్పర్లు, ఒక లారీ, ఒక జేసీబీ సహాయంతో నారాయణ నెల్లూరు గ్రామ సమీపంలోని చెయ్యేరు నదిలో ఇసుకను టిప్పర్లకు లోడు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎస్‌ఈబీ అధికారులు, పెనగలూరు పోలీసులు టిప్పర్లను, లారీని, ఇటాచీ, రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన విషయం తెలిసిందే. సీజ్ చేసిన వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించగా సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి ఒక్కో వాహనానికి రూ. 2 లక్షలు అపరాధ రుసుము విధించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్ డేకార్స్‌లో అగ్నిప్రమాదం

– రూ.10లక్షల మేర నష్టం



అగ్నికి ఆహుతి అయిన సామగ్రి

రాజంపేట రూరల్ : జాతీయ రహదారిపై ఉస్మాన్ నగర్ వద్ద ఉన్న వీఆర్ డేకార్స్‌లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. యజమాని టి.వెంకటరమణ మధ్యాహ్నం సమయంలో షాపునకు షట్టర్ వేసి వెళ్లాడు. షాపులో నుంచి పొగలు రావడంతో పక్కనున్న షాపుల వారు యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన అగ్నిమాపక అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఫైర్ అధికారి కె. సుభాన్ తన సిబ్బందితో వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు యజమాని వెంకటరమణ తెలిపారు. తన షాపులో ఉన్న రూ.10లక్షల విలువ చేసే సామగ్రి అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఎర్రచందనం స్మగ్లర్లు పరార్

సుండుపల్లె : అడవిలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా వారు పరార్ అయినట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో పీలేరు రహదారి నుంచి సుండుపల్లె మీదుగా అడవిలోకి ప్రవేశించేందుకు ఆరుగురు ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించగా ఎదురుగా వచ్చిన ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీ కొని, ఫారెస్టు సిబ్బంది వాహనం ఆపుతున్నా ఆపకుండా ఐదుగురు స్మగ్లర్లు తప్పించుకున్నట్లు తెలిపారు. పరారైన వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు. వారివద్ద నుంచి ఏపీ26బీఏ2902 నెంబరుగల ఒక డస్టర్ వాహనం, ఐదు గొడ్డళ్లు, ఒక రంపం , ఎనిమిది చిన్న చిన్న బియ్యం ప్యాకెట్లు, ఆరు బ్యాగులు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రజని, డీఆర్ఓ రమేష్ బాబు, ఫారెస్టు సిబ్బంది సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో అపశ్రుతి

- టపాసులతో కాలిన టమాటా క్రేట్లు
- దెబ్బతిన్న మరో రైతు భవనం
- రూ.5 లక్షలు నష్టం



అంగళ్లు టమాటా మండీల వద్ద క్రేట్లు కాలడంతో ఎగిసి పడుతున్న మంటలు

కురబలకోట : అంతిమ సంస్కారంలో భాగంగా పేల్చిన టపాసులు ఆ మార్గంలో పక్కనే ఉన్న టమాటా క్రేట్లపై పడటంతో అవి అంటుకుని కాలిపోయాయి. క్రేట్లను ఆనుకునే ఉన్న మరో రైతు భవనం ఎగిసిపడిన మంటలకు దెబ్బ తింది. ఈ సంఘటనలో రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు..కురబలకోట మండలం అంగళ్లు గ్రామం మలిపెద్దివారిపల్లెకు చెందిన చిటికి తిప్పారెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఇతని అంత్యక్రియలు మంగళవారం ఉదయం నిర్వహించారు. ఆఖరి మజిలీ కావడంతో అంతిమ యాత్రను ఘనంగా ముగించాలన్న ఉద్దేశంతో పూలు చల్లుతూ టపాసులు పేలుస్తూ ముందుకు సాగారు. ఆ మార్గంలో పక్కనే ఉన్న టమాటా మండీల వద్ద మదనపల్లెకు చెందిన టమాటాల వ్యాపారి పీఏకె (పి. అహ్మద్ ఖాన్) ముందు రోజు రాత్రి లారీ లోడు టమాటా క్రేట్లు తోలాడు. పేలిన టపాసులు పక్కనే ఉన్న టమాటా క్రేట్లపై నిప్పురవ్వలు పడి అంటుకున్నాయి. ప్లాస్టిక్‌వి కావడంతో మంటలు ఎగిసి పడ్డాయి. మంటలకు అంగళ్లు, పరిసర ప్రాంతాల వారు కలవరపడ్డారు. అనంతరం మదనపల్లె ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే క్రేట్లన్నీ కాలిపోయాయి. రూ. 3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. క్రేట్లు కాలడంతో వీటిని ఆనుకుని ఉన్న చిటికి హరినాథరెడ్డికి చెందిన భవనం కూడా నల్లగా మారిపోయింది. ప్లాస్టింగ్, కిటికీలు, గోడలు దెబ్బతిన్నాయి. ఇతని భవనానికి కూడా రూ.2 లక్షలకు పైగా నష్టం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఊహించని పరిణామం పట్ల విచారం వ్యక్తమవుతోంది.

భూ వివాదంలో మహిళలపై దాడి

- గాయపడిన వృద్ధురాలు
- ప్రాణహాని ఉందంటూ నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు



దాడికి గురైన వృద్ధురాలు అక్కులమ్మ

నిమ్మనపల్లె : భూ వివాదం కారణంగా ఇద్దరు మహిళలపై వారి బంధువులు దాడి చేయగా, వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఘటనలో బాధితులు తమకు ప్రాణహాని ఉందంటూ నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టావాండ్లపల్లె వడ్డిపల్లికు చెందిన చిన్నప్ప భార్య పి.అక్కులమ్మ(73)కు సర్వేనెంబర్ 1130–5లో 5.45 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో తమకు భాగం ఉందంటూ బంధువులు సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా పల్లపు వెంకటరమణ భూమి సర్వేకు దరఖాస్తు చేశారు. మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు పొలం వద్దకు వచ్చారు. భూమి సర్వే చేసి ఇరువర్గాల స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకుంటుండగా, అక్కులమ్మ బంధువులైన పి.రామయ్య, చిన్న రమణ, పెద్ద రమణ, శ్రీనివాసులు, తదితరులు కలసి ఒక్కసారిగా అక్కులమ్మ (73), ఆమె కూతురు సరస్వతి(45)పై రెవెన్యూ అధికారుల సమక్షంలోనే దాడికి తెగబడ్డారు. గాయాల పాలైన బాధితులు స్థానికుల సాయంతో నిమ్మనపల్లె పీహెచ్‌సీకి వెళ్లారు. అనంతరం అక్కులమ్మకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి రెఫర్ చేశారు. తమ బంధువులైన చిన్న రమణ, రామయ్య, వారి అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని అక్కులమ్మ, సరస్వతి నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

హత్యాచార నిందితులను బహిరంగంగా ఉరి తీయాలి

రాయచోటి అర్బన్ : కలకత్తా నగరంలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి అతిక్రూరంగా హత్యచేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని ఏఐఎస్‌బీ, పీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచార సంఘటనను నిరసిస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రోజురోజుకు రక్షణ కరువవుతోందన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, పోలీసులు జూనియర్ డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. హత్యలో కీలక వ్యక్తుల ప్రమేయం ఉందన్న అనుమానం కూడా దేశప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు. కేసును సీబీఐకి బదిలీచేసి చేతులు దులుపుకోకుండా బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు రాము, బాలాజి, వినయ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాజంపేట రూరల్ : రాజంపేటలో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర డిమాండ్ చేశారు. ఇసుక సమస్య పరిష్కారం చేసి నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాక్టర్ ఇసుక రూ.7వేలు, టిప్పర్ ఇసుక రూ.30వేలతో అక్రమంగా రవాణా చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం ఇసుక క్వారీలను ఏర్పాటు చేసి నిర్మాణ రంగం కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య, నరసింహ, మహమ్మద్ హుస్సేన్, నన్నే సాహెబ్, కె.రమణ, ఈ.రమణ, వెంకప్ప, తదితరులు పాల్గొన్నారు.

దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని శివ నర్సింగ్ కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు రకాల జ్వరాలు, వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్న దోమల నివారణ విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. డిస్ట్రిక్ట్ మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు దోమల నివారణకు కృషి చేస్తామంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్, జయరామయ్య, ముజీబ్, పర్యవేక్షకులు వెంకటేశ్వరరెడ్డి, ఖాదర్‌బాషా, కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం : కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం సరస్వతీపల్లెకు చెందిన లారీ డ్రైవర్ పెంచలయ్య (28) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు .. మండల పరిధిలోని సరస్వతిపల్లెకు చెందిన చెన్నూరు పెంచలయ్య అనే వ్యక్తి సిలిండర్ ఏజెన్సీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సిలిండర్ల లారీ లోడుతో కర్నూలు జిల్లా డోన్‌కు వెళుతుండగా ఆగివున్న లారీని ఢీకొన్నాడు. దీంతో పెంచలయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం పెంచలయ్య మృత దేహాన్ని రామాపురం మండలంలోని మృతుని స్వగ్రామానికి తీసుకువచ్చారు.

పాము కాటుతో చిన్నారి మృతి





మృతి చెందిన చిన్నారి, కాటేసిన పాము

ములకలచెరువు : పాముకాటుతో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని దేవల చెరువు పంచాయతీ రాజుగారిపల్లికి చెందిన సింగారెడ్డి కుమార్తె సోనిక(5) ఇంటి ఆవరణంలో ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదనపల్లి హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగప్ప కుమారుడు అంజలి కుమార్ (30) ట్రక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం చెన్నువారిపల్లెలో అవ్వ మృతి చెందగా, ఆమె అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బి.కొత్తకోట నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని రంగసముద్రం రోడ్‌లో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపుతప్పి అంజలి కుమార్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అరటికాయల వాహనం బోల్తా

రాజంపేట : రాజంపేట పాతబస్టాండ్ సర్కిల్‌లో అరటి కాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం మంగళవారం మధ్యాహ్నం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న అరటికాయలు నేలపాలు కాగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనం బోల్తాపడినప్పుడు జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో వాహనాన్ని రోడ్డుపక్కకు తీయించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె వద్ద మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటనలో మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు. చిన్నమండెం మండలం దేవపట్లకు చెందిన కె.శంకర(45), కె. సాలమ్మ(39)లు గుర్రంకొండ పంచాయతీ సుంకరవాండ్లపల్లెలోని తమ బంధువుల ఇంటికి ఈనెల 17 సాయంత్రం వచ్చారు. ఈనెల18న సుంకరవాండ్లపల్లెనుంచి తిరిగి తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరారు. మార్గమధ్యంలో సూరప్పగారిపల్లె మిట్ట వద్దకు చేరుకోగానే రాయచోటి వైపు వెళుతున్న ఓ గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులిద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుల్ని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాలమ్మ మంగళవారం మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు వాహనాలు ఢీ

– వ్యక్తికి తీవ్ర గాయాలు

పుల్లంపేట : కడప – చెన్నై జాతీయ రహదారి ఏపీ ఆదర్శ పాఠశాల వద్ద మంగళవారం ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ అశోక్ కాలు నుజ్జు నుజ్జు అయింది. విషయం తెలుసుకున్న పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అశోక్‌ను 108 వాహనం ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జేఎంజే కళాశాల వద్ద రెండు వాహనాలు ఢీ

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోని జేఎంజే కళాశాల వద్ద మంగళవారం తెల్లవారు జామున కారు– సిమెంటు లారీ ఢీకొన్నాయి. తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారును జేఎంజే కళాశాల సమీపంలో ఎర్రగుంట్ల నుంచి తిరుపతి వైపు వెళుతున్న సిమెంటు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఏఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా వాహనాలు ఢీకొన్నట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న స్కూల్ వ్యాన్

– త్రుటిలో తప్పిన ప్రమాదం



పుల్లంపేట : నారాయణ స్కూల్ వ్యాన్ మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి సమీపాన విద్యుత్ స్తంభాన్ని ఢీ కొనడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే రాజంపేట నుంచి నారాయణ స్కూల్ విద్యార్థులను ఊటుకూరు, వెంకటరాజంపేట, అనంతయ్యగారిపల్లి, రాజుగారిపల్లి, పీవీజీపల్లి, అగ్రహారం, కొమ్మనవారిపల్లి, రాచపల్లి, పుల్లంపేట, రామక్కపల్లి, రెడ్డిపల్లి మీదుగా ప్రతిరోజూ పాఠశాలకు తీసుకెళ్తారు. మంగళవారం కొమ్మనవారిపల్లి వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని వ్యాన్ ఢీ కొనడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్‌కు కళ్లుతిరగడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.